
ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయం వద్ద కురుస్తున్న వర్షం

మరో అల్పపీడనం

జోరుగా కురుస్తున్న వర్షాలు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 20 : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతోందని ఇప్పటికే వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 23 నుంచి అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందని, కోస్తా ప్రాంతంలో 21వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నిన్న మొన్నటివరకు ఎండల తీవ్రత విపరీతంగా ఉండగా ఒక్కసారిగా శుక్రవారం వాతావరణంలో మార్పులు సంభవించాయి. మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడి వర్షాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు వరి, మిర్చి, పత్తి, మినుము, అరటి, కూరగాయలు పంటలు మునిగిపోయి రైతులు నష్టపోయారు. మళ్ళీ అల్పపీడనం నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చేనేతకు పూర్వవైభవం

- త్వరలో చేనేత సంఘాలకు ఎన్నికలు
- వైసీపీ పాలనలో సంఘాలు నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వం బలోపేతానికి చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 22 సంఘాలు
- రెండు వేల మందికి పైగా సభ్యులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 20 : చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడే చేనేత సహకార సంఘాల బలోపేతంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాలను నియమించేందుకు సన్నద్ధమవుతోంది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2019లో ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత జగన్, అధికారంలోకి వస్తే చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తామని, మరిన్ని పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంఘాలను నిర్వీర్యం చేశారు. గత ఐదేళ్లు సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. వైసీపీ నేతలు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు నామినేటెడ్ పోస్టుల ద్వారా త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించనుంది. టీడీపీ హయాంలో అమలైన మార్కెట్ ఇన్‌సెంటీవ్, యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, ముద్రా రుణాలు వంటి పథకాలను పునరుద్ధరించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ప్రస్తుతం 22 చేనేత సహకార సంఘాలు ఉండగా, 2వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. పదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతూ ఉండడంతో మళ్లీ తమకు మంచిరోజులు వస్తాయని, చేనేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో నూతన సహకార సంఘాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఎస్.రఘునంద తెలిపారు. వృత్తి చేస్తూ వ్యక్తి గతంగా, మాస్టర్ వీవర్ కింద చేస్తున్న చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు కొత్తగా చేనేత సహకార సంఘాలు ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నారు. ప్రభుత్వం అందించే రాయి తీలు పొందేందుకు సంఘాలు ఏర్పాటు అయి ఉండాలి. సభ్యులుగా చేరేవారు నేతవృత్తి, వృత్తే జీవనాధారంగా ఉండాలి. కనీసం 30 మంది సభ్యులు ఉండి, ఒక్కో సభ్యుడికి కనీస షేర్ ధనం వెయ్యి రూపాయలు, ప్రవేశ రుసుము రూ.30లు చెల్లించాలి. దరఖాస్తులు టీటీడీ కల్యాణ మండపం వద్ద చేనేత జౌళిశాఖ కార్యాలయం, ఆప్కో షోరూమ్‌పైన అందజేయాలి.

ఇంత అపచారమా..!



శ్రీవారి లడ్డూ కల్తీపై భక్తుల్లో ఆగ్రహావేశాలు

- తప్పు చేసిన వారిని ఆ దేవుడే శిక్షిస్తాడంటూ కామెంట్లు
- మతాల మధ్య వైసీపీ చిచ్చుపెట్టే కుట్రలంటూ తీవ్ర అసహనం
- నడిరోడ్డులో దోషులను ఉరి తీయాలి : టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని
- ఏ ఒక్కరిని వదిలిపెట్టకండి : కృష్ణప్రసాద్, బీజేపీ ఏలూరు కన్వీనర్
- ఆలయాలకు రక్షణ లేదు : వబిలిశెట్టి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుమల ఏడుకొండల స్వామిని చూసి తరించడం ఒక ఎత్తయితే.. శ్రీవారి కొండపై లభించే లడ్డూను తెచ్చి నలుగురికి పంచితే అదొక వైభోగం. వయస్సుతో నిమిత్తం లేకుండా లడ్డూ ప్రసాదాన్ని కళ్ళకద్దుకుని మరీ ఆ దేవదేవుడిని హృదయంలో స్మరించుకుంటారు. అలాంటి మధురానుభూతి కలిగించే లడ్డూలో కల్తీ జరిగిందని తెలిసి అదికూడా వైసీపీ హయాం నుంచే కొనసాగుతుందనే విషయం బట్టబయలు కావడంతో శ్రీవారి భక్తుల్లో ఆవేదన పెల్లుబుకింది. ఇంత అపచారం చేస్తారా..అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

హిందువుల మనోభావాలకు నిలువుటద్దం తిరుపతి వెంకన్న తియ్యటి లడ్డూ. స్వామి దర్శనానంతరం ప్రతీ ఒక్కరూ అతి పవిత్రంగా భావించి సొంత ప్రాంతాలకు తెచ్చే లడ్డూలో వైసీపీ నాణ్యత లేని కల్తీ నెయ్యిని ఉపయోగించిందంటూ ఆఖరుకి ల్యాబ్ పరీక్షల్లోను బయటకు వచ్చిన నిజాలు అందరినీ నివ్వెర పోయేలా చేస్తున్నాయి. ఈ వ్యవహారమంతా బట్టబయలైన క్షణం నుంచే భక్తులంతా ఆగ్రహంతో ఉన్నారు. వాస్తవానికి గత ఐదేళ్లుగా సామాన్య భక్తులు తిరుపతి వెంకన్న దర్శనం చేసుకోవడమే అతి కష్టంగా మారి గిలగిలలాడారు. రాజకీయ సిఫార్సులతో వెళ్ళే వారంతా క్షణాల్లో దర్శనం ముగించుకోగా సాధారణ భక్తులు అష్టకష్టాలు పడ్డారు. ఒకానొక దశలో తిరుపతి వెంకన్న దర్శనం అదొక ఊహాజనితంగా మారేలా గడిచిన ప్రభుత్వంలో కొందరి పనితీరు స్పష్టంగా కనిపించింది. దూర భారం భరించి దర్శనానికి తరలివెళ్ళినా గదులు దొరక్క కొందరు, కరువైన సౌకర్యాలతో ఇంకొందరు, ఆఖరుకి లడ్డూలను కావాల్సినన్ని తెచ్చుకోవడానికి అవకాశం లేక ఉసూరుమన్నారు. వెంకన్న పట్ల జరుగుతున్న అపచారానికి చెంపలేసుకున్నారు. అప్పట్లో నోరుమెదిపే శక్తిలేక పవిత్ర పుణ్యక్షేత్రంలో వివాదాలకు తావులేకుండా ఎవరంతట వారుగా దర్శనం దొరికితే చాలనుకున్నారు. ప్రసాదంగా లడ్డూ దక్కితే అదే పదివేలు అనుకున్నారు. కాని వైసీపీ సర్కార్ శ్రీవారి లడ్డూనే అపవిత్రం చేసేలా వ్యవహరించిందన్న విషయం ఇప్పుడు బయటపడడంతో అందరూ నివ్వెరపోతున్నారు. ప్రసార మాధ్యమాల్లో వెలువడుతున్న వార్తలను చూసి విస్తుపోతున్నారు. తమ నమ్మకాలను కాలరాసేందుకు ప్రయత్నించారంటూ ఆగ్రహంతో ఊగిపోతున్నారు. శ్రీవారిపై తమకున్న అపార నమ్మకాన్ని సైతం జగన్ ప్రభుత్వం కాలరాయడం పట్ల వీరంతా ఆగ్రహంతో ఉన్నారు. దేవుడి విషయంలో ఎందుకింత నికృష్టంగా వ్యవహరించారు. ఎక్కడికక్కడ చేతికందిన నిధులు నొక్కేశారు. ఆఖరుకి తిరుమల వెంకన్న లడ్డూ విషయంలోను ఇంత అపచారమా.. అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎక్కడా ఉండవని, కేవలం వైసీపీ మూకల వల్లే ఇది సాధ్యమైందనే భావనే అందరిలోను ఉంది.



వెంకన్నా.. క్షమించు

తిరుపతి వెంకన్న లడ్డూ తయారీలో అపచారం జరిగిందన్న సమాచారం వెల్లువెత్తగా ఎక్కడికక్కడ మహిళలు సైతం ఈ సంఘటనపై శాపనార్థాలు పెడుతున్నారు. వెంకన్న.. మమ్మల్ని క్షమించు.. ఇలా దౌర్భాగ్యంగా సొమ్ముల కోసం ఎగబడుతున్న వారిని క్షమించవద్దంటూ ఇళ్ళల్లో వెంకన్న ఎదుట దీపాలు పెట్టారు. ఇంతటి ఘోరం ఎక్కడా చూడలేమని, కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిం చిందేకాక ఇప్పుడు ఇంకా బొంకుతున్నారని.. జరిగిందేమిటో, చేసిన వారెవరో శిక్షించాల్సింది మరెవరినో వెంకన్న స్వయంగా త్వరలోనే నిర్ధారిస్తారంటూ ఒకింత కటువుగా మాట్లాడుతున్న వారూ లేకపోలేదు. 'తిరుమల తిరుపతి లడ్డూ విషయంలో ఒక్కొక్కరిది ఒక్కో ఆవేశపూరిత భావోద్వేగం. లడ్డూ తయారీలో కూడా కక్కుర్తిపడతారా. పోయేకాలం వచ్చినట్టుంది అందుకనే బరితెగింపు. ఎన్నడైనా చూశామా. వెంకన్నతో పెట్టుకుంటే ఏమైపోతారో. ఎందుకిలా ఒకరి ఇష్టాన్ని మరొకరు దెబ్బతీయాలనుకుంటున్నారా. పైపైకి నంగనాచి కబుర్లు, లోలోన నికృష్ట చర్యలు. వెంకన్ననే నమ్ముకుని నిత్యం ఆరాధించే కోట్లాది మంది భక్తుల మనోభావాలను పూర్తిగా దెబ్బతీశారు..' మహాలక్ష్మి అనే గృహిణి ఆవేదన ఇది. వివిధ పార్టీలకు చెందిన వారు సైతం తీవ్రంగా మండిపడుతున్నారు. తిరుపతి లడ్డూ విషయంలో జరిగిందని ఘోర అపచారమని వీరంతా పూర్తిగా నమ్ముతున్నారు. దీనికంతటికి జగన్ సారథ్యం వహిస్తున్న వైసీపీయే కారణమంటూ ఆగ్రహంతో ఊగిపోతున్న వారి సంఖ్య శుక్రవారం నాటికి మరింత పెరిగింది.

నడిరోడ్డు మీద ఉరి తీయాలి



ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. లక్షలాది మంది భక్తుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారు. తాము ఇష్టదైవంగా కొలిచే తిరుమల వెంకన్నకు పదేపదే అపచారం చేసేలా ఐదేళ్ల పాటు వైసీపీ వ్యవహరిస్తూనే వచ్చింది. అడుగడుగునా భక్తులు ఇబ్బందులు పడేలా, కనీసం దర్శనం చేసుకునే అవకాశం కల్పించకపోగా ఆటంకాలు సృష్టించే ప్రయత్నం కొనసాగింది. భక్తుల పట్ల, వారి సౌకర్యాల పట్ల చూసీచూడనట్టుగా వదిలేశారు. ఏకంగా తిరుపతి లడ్డూ విషయంలో అపచారం చేశారు. దీనికి కారణమైన దోషులను గుర్తించాల్సిందే. కేసుల విచారణ పేరిట కాలయాపన చేయకుండా నడి రోడ్డుపై ఉరి తీయాల్సిందే.

– గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

దేవుడు క్షమించడు..



హిందువులు ఇష్టపడే వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. ఆ దేవుడు కూడా వైసీపీని, మాజీ సీఎం జగన్‌ను క్షమించబోడు. హిందువుల మనోభావాలతో ఆటలాడుకునే ధైర్యం చేసి కోరి మీదకు తెచ్చుకున్నారు. హిందువుల శాపం తగలక మానదు. దోషులెవరో విచారణలో తేల్చాల్సిందే. అందరి మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తులు ఎవరైనా సరే ఏ స్థాయిలో ఉన్నా శిక్షించాల్సిందే. ఇది ప్రతీ శ్రీవారి భక్తుల్లో ఉన్న మనసులోని మాట. బీజేపీ కూడా శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడి ఘోర తప్పిదం చేసిన వారిని, వారి వెనుక ఉన్న వారిని బహిరంగంగా శిక్షించాలని కోరుకుంటోంది.

– కె.కృష్ణప్రసాద్, ఏలూరు పార్లమెంటు బీజేపీ కన్వీనర్

కమీషన్ల కక్కుర్తితోనే ఇలా..



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రంపై విశ్వహిందూ పరిషత్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఆవు నెయ్యికి బదులు, వివిధ జంతువుల కొవ్వుకలిపిన నెయ్యిని వాడడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. కేవలం కమీషన్ల కోసం కుక్కుర్తి పడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. దేవదాయ, ధర్మదాయ శాఖ వల్ల హిందూ ఆలయాలకు రక్షణ లేదు. కాబట్టి శాఖను రద్దు చేసి హిందూ ధార్మిక మండలికి అప్పగించాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపాదించిన 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు' అనేది నెలకొల్పాలనే ప్రతిపాదనను వీహెచ్‌పీ సమర్థిస్తోంది. లడ్డూ అపవిత్రంపై వీహెచ్‌పీ న్యాయపరంగా పోరాటానికి సిద్ధమవుతోంది.

–వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద.. వైద్యాధికారుల ధర్నా

- నేటి నుంచి ఆందోళన మరింత ఉధృతం
- నిలిచిన పల్లె వైద్యం.. వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం
- డిప్యుటేషన్లపై తాత్కాలికంగా మండలానికో డాక్టర్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 : పీజీ వైద్య విద్య అడ్మిషన్లలో ఇన్‌సర్వీస్ కోటా కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యాధికారులు ఈనెల 14 నుంచి చేపట్టిన దశలవారీ ఆందోళనను తాజాగా జిల్లా స్థాయికి విస్తరించారు. తమ డిమాండ్ల సాధన కోసం ప్రధానంగా ఆటంకంగా వున్న జీవో 85ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటూ జిల్లా లోని గ్రామీణప్రాంత పీహెచ్‌సీల వైద్యాధికారులు శుక్రవారం నుంచి ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అయితే కార్యాలయ విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్నా లేదా నిరసన ప్రదర్శనలకు అనుమతిలేనందున టెంట్‌లను తొలగించాల్సిందిగా పోలీసులు హెచ్చరించడంతో బహిరంగ ప్రదేశంలోనే వైద్యాధికారులు నినాదాలతో ప్రదర్శనలు నిర్వహించారు. మరోవైపు డాక్టర్ల సమ్మె కొనసాగుతుండడంతో పల్లెప్రాంతాల్లో వైద్యసేవలు స్థంభిస్తున్నట్టు సమాచారం అందుకున్న వైద్యఆరోగ్యశాఖ ఎట్టకేలకు అప్రమత్తమైంది. అందుబాటులో వున్న డాక్టర్లను మండలానికి ఒకరు వంతున డిప్యుటేషన్లపై తాత్కాలికంగా విధులు కేటాయించింది. శుక్రవారం జిల్లాలో మొత్తం 128 వైద్యాధికారులకు గాను కేవలం 36 మంది విధులకు హాజరయ్యారని, మిగతా వారంతా సమ్మెలో పాల్గొంటున్నట్టుగానే భావిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తెలిపారు. అయితే మండలానికి ఒకరు వంతున తాత్కాలికంగా విధులు కేటాయించిన డాక్టర్లు ఆయా పీహెచ్‌సీల్లో ఎప్పుడు అందుబాటులో ఉంటారో స్పష్టతలేదు. క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం ప్రకారం రోగాలు, జబ్బులతో వచ్చేవారికి పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లతోనే 'వైద్య సలహాలు' ఇప్పిస్తున్నారని తెలుస్తోంది. .

నేటి నుంచి కార్యాచరణ అమలు

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యాధికారులు చేపట్టిన ధర్నాలో ఏపీ పీహెచ్‌సీల డాక్టర్ల సంఘం (ఏపీపీహెచ్‌సీడీఏ)



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న వైద్యాధికారులు

జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రకుమార్ మాట్లాడుతూ ఆందోళనను రాష్ట్రస్థాయి నుంచి అన్ని జిల్లాలకు వికేంద్రీకరించడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని వివరించారు. ఇందులో భాగంగా శనివారం నుంచి ప్రభుత్వానికి పంపాల్సిన అన్ని వైద్య కార్యక్రమాలు, పథకాల నివేదికలను సస్పెండ్ చేస్తామని, ఇప్పటివరకు పీహెచ్‌సీల్లో అందించిన అత్యవసర వైద్యసేవలను సైతం నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను శాంతియుతంగానే నిర్వహిస్తున్నా అనుమతులు లేవంటూ వైద్యాధికారులను అణగదొక్కాలని ప్రయత్నించడం హాస్యాస్పదమన్నారు. ఇటువంటి చర్యలు ఆందోళనను మరింత ఉధృతం చేయడానికే దారి తీస్తాయని హెచ్చరించారు. ఆదివారం కూడా ధర్నా కొనసాగుతుందని, సోమవారం చలో విజయవాడ నిర్వహిస్తామని, ప్రభుత్వం అప్పటికీ స్పందించకుంటే 24న అత్యవసర సమావేశాన్ని నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఇన్‌సర్వీస్ ఎంబీబీఎస్ వైద్యాధికా రులకు కొనసాగిస్తున్న కోటాప్రకారమే పీజీ వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం నుంచి ఆందోళనకు జిల్లాలోని ఏజెన్సీప్రాంత మండలాల పీహెచ్‌సీల వైద్యాధికారులు కూడా హాజరవుతారని వివరించారు. కొవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన వైద్యాధికారులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ధర్నా అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్టకు వినతిపత్రాన్ని అందజేశారు.

మన మంచి ప్రభుత్వం..



కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం టీడీపీ శ్రేణులు జిల్లావ్యాప్తంగా సంబరాలు చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. పలుచోట్ల కేక్ కటింగ్ జరిపారు. ఈ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేసిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఏలూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు కూటమి ప్రభుత్వం వందరోజుల్లో ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ కరపత్రాలు పంచారు.



చెరకు పంటను పరిశీలిస్తున్న ఏపీ చెరకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు తదితరులు

చెరకు టన్నుకు రూ.4 వేలు మద్దతు ధర ప్రకటించాలి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 20: టన్ను చెరకుకు 9.5 రికవరీ శాతంపై రూ.4 వేలు మద్దతు ధరను ప్రకటించాలని ఏపీ చెరకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తక్కెళ్లపాడు, గుణ్ణపల్లి గ్రామాల్లో చెరకు పంటను పరిశీలించారు. తక్కెళ్లపాడులో చెరకు రైతు ఈశ్వరరెడ్డి 2468 రకం సాగు చేయగా దిగుబడి ఎకరాకు 70 టన్నులు రావడంతో రైతు నుంచి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో చెరకు విస్తీర్ణం 5 లక్షల ఎకరాల నుంచి 5 వేల ఎకరాలకు పడిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల చెరకు రైతుల సంక్షోభంలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. చెరకు ఫ్యాక్టరీలన్నీ మూతపడ్డాయని రైతులు, కూలీలు, కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఆంధ్రాసుగర్స్ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన చెరకు విత్తనాన్ని రైతు ఈశ్వరరెడ్డి సాగుచేసి సత్ఫలితాలు సాధించారన్నారు. సంఘనేతలు కె.భాస్కరరావు, కె.శ్రీనివాస్, జివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ ఎంపికలు ఇలా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికల బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, కరాటే, స్విమ్మింగ్ జట్ల ఎంపికలు ఈనెల 24న నిర్వహించనున్నట్టు ఎస్జీఎఫ్ కార్యదర్శి కె.అలివేలు మంగ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు ఎంట్రీఫారంలను తప్పని సరిగా తెచ్చుకోవాలని సూచించారు. బాలికలకు బాస్కెట్‌బాల్ ఎంపికలు ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, బాలబాలికలకు స్విమ్మింగ్ ఎంపికలు ఏలూరు ఏ.ఎస్.ఆర్ స్టేడియం, బాలబాలికలకు రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, కరాటే ఎంపికలు ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరుగుతాయన్నారు. వివరాలకు 90308 94311 నంబరులో సంప్రదించాలని కోరారు.

సౌత్ సెంట్రల్ పరిధిలో పలు రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 20 : సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని సిగ్నల్ వ్యవస్థ ఆధునీకరణ, నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కొవ్వూరు- గోదావరి-రాజమండ్రి - కడియం సెక్షన్లలో ఈ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా రైళ్ళు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

రద్దయిన రైళ్ళు : 29వ తేదీన తిరుపతి - విశాఖపట్టణం (22708), 30వ తేదీన విశాఖపట్టణం - తిరుపతి (22707), విజయవాడ - విశాఖపట్టణం (12718) విశాఖపట్టణం-విజయవాడ (12717),విశాఖపట్టణం-గుంటూరు(22701), గుంటూరు-విశాఖ పట్టణం (22702), విజయవాడ - రాజమండ్రి (07768), రాజమండ్రి - విశాఖపట్టణం (07465), విశాఖపట్టణం - రాజమండ్రి (07467) 29, 30వ తేదీల్లో గుంటూరు -విశాఖపట్టణం (17239) ఈనెల 30, అక్టోబరు 1వ తేదీన విశాఖపట్టణం -గుంటూరు (17240) వెళ్లాల్సిన రైళ్లను రద్దు చేశారు.



భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో భద్రతా సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

13 మంది ఆర్‌పీఎఫ్ సిబ్బందికి సత్కారం

భీమవరం క్రైం, సెప్టెంబరు 20 : ప్రయాణికుల రక్షణలో భద్రతలో రైల్వే భద్రతా దళాలు చిత్తశుద్ధితో పనిచేస్తాయని భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ సీఐ షేక్ దస్తగిరి అన్నారు. రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవం శ్రీవిజ్ఞానవేదిక, టౌన్ ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రయాణికుల విలువైన వస్తువులను దొంగల బారి నుంచి రక్షణ కల్పించడంతో పాటు రైలు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురయ్యే ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 13 మంది డివిజన్‌లోని ఆర్‌పిఎఫ్ సిఐతో పాటు సిబ్బందిలను సత్కరించామన్నారు.ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కె.రఘురామయ్య , బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, డీఎన్నార్ కళాశాల మేనేజర్ వీరయ్య, కెప్టెన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ ఆలయంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 20 : మావుళ్ళమ్మ ఆలయంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలు రూపొందించేందుకు దేవదాయ ధర్మదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్ కుమార్, డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచారి పరిశీలించారు. పార్కింగ్ స్థలం, ప్రసాదాల తయారీ కోసం భవనం, పెయింటింగ్ తదితర పనులు కోసం భీమవరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సైదా, భీమవరం అసిస్టెంట్ ఇంజినీర్ రాజ్ కుమార్, సైట్ ఇంజనీర్ హేమంత్ పరిశీలించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ సుబ్బారాయుడు ,ఈవో కృష్ణంరాజు , అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ .పాల్గొన్నారు.



అమ్మపాలెం వరిపొలంలో పర్యటించిన మెక్సికో బృందం

రైతు శాస్త్రవేత్తల పనితీరు అద్భుతం

పెదవేగి సెప్టెంబరు 20 : రైతు సాధికార సంస్థ రూపొందించిన రైతు శాస్త్రవేత్తల కోర్సు, శాస్త్రవేత్త పనితీరు అద్భుతంగా ఉందని మెక్సికో దేశ ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా కితాబునిచ్చారు. మెక్సికన్ బృందం మూడురోజుల పర్యటనలో భాగంగా పెదవేగి మండలం అమ్మపాలెంలో శుక్రవారం పర్యటించింది. గ్రామంలో సాగవుతున్న ప్రకృతి సాగు విధానాలు, రైతులు అవలంభిస్తున్న పద్ధతులను బృందం పరిశీలించింది. ఏలూరు మండలం వెంకటాపురంలో పర్యటించిన బృందం అక్కడ రైతు సాధికార సంస్థ సూచనల ప్రకారం వరిపొలంలో గట్లను వెడల్పుచేసి, గట్లపై కూరగాయలు పండిస్తూ అదనపు ఆదాయాన్ని అందుకుంటున్న విధానాన్ని అక్కడి రైతులు, మెక్సికో బృందానికి వివరించారు. ఈ విధానంలో ఎకరానికి రూ.30వేలు అదనపు ఆదాయాన్ని పొందుతున్నామని రైతులు తెలిపారు. రసాయన రహిత విధానంలో పండిస్తున్న కూరగాయలను కలెక్టర్ కార్యాలయ సముదాయంలో విక్రయిస్తున్నామని, వరిపంట ఉత్పత్తులను శ్రీవారి నైవేద్యం, నిత్యాన్నదానం కోసం తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తున్నామని చెప్పారు.

కొబ్బరి అధరహో!



- ఆల్‌టైం రికార్డు ధర
- 1000 కాయలు రూ.13 వేలు
- దిగుబడి తగ్గింది.. ధర పెరిగింది
- ఊపందుకున్న ఎగుమతులు..
- ఉత్తరాధి రాష్ట్రాలకు కురిడీ ఎగుమతి
- ఢిల్లీ క్వాలిటీ కాయలు రూ. 15 వేలు

పాలకొల్లు, సెప్టెంబరు 20: ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరి రైతులు సంతోషంలో ఉన్నారు. దశాబ్ద కాలానికి ముందు కొబ్బరి ధర గరిష్టంగా రూ.12 వేలు పలికింది. ఇపుడు రైతు వారి కొనుగోల్లు తూర్పుగోదావరి జిల్లాల్లో వెయ్యి కాయలు ధర రూ.13 వేలు పలుకుతుండగా ఉమ్మడి పశ్చిమలో ఆయా ప్రాంతాలను బట్టి రూ.12 వేల నుంచి 13 వేలు ఉంది. పండగల సీజన్ మొదలు కావడం, సమీపం రోజుల్లో దశమి, దీపావళి పండుగలు ఉండటంతో ఎగుమతులు ఊపందుకున్నాయి. కాగా కొబ్బరి దిగుబడి మూడింట రెండొంతులకు పడిపోయింది. ఎకరానికి 2 వేల కాయలు దిగుమతి వచ్చే పరిస్థితులు గతంలో ఉండగా ఇపుడు 1000, 1500 మధ్యలో దిగుబడి వస్తున్నది. దీనికి తోడు సమీప రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటకలో కొబ్బరి దిగుబడి తగ్గుముఖం పట్టింది. దీంతో ధరలు పెరిగాయి. పాలకొల్లు, తణుకు, ఏలూరు, భీమవరం వంటి పట్టణ ప్రాంతాల్లో పెద్ద సైజు కొబ్బరి కాయ రూ.25 అమ్ముతున్నారు. కొబ్బరి బొండం ధర రూ.15 నుంచి రూ.25 వరకు ఉన్నది.

ఉత్తరాధి రాష్ట్రాలకు ఎగుమతులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనూ, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ కోనసీమ ప్రాంతాల్లో నాణ్యత గల కొబ్బరి కాయలను అటకకు వేస్తారు. ఇవి కురిడీగా మారిన తరువాత దిగుమతి చేస్తారు. కురిడీలో పెద్ద సైజు ఎగుమతి ధరలు వెయ్యి కాయలు రూ.14 వేలు ఉండగా చిన్న సైజు కాయలు రూ.11 వేలు ఉంది. ఢిల్లీ క్వాలిటీ కాయ ధర సైతం రూ.14 వేలు పలుకుతుంది.

వ్యాపారుల్లో జోష్

ధరలు మెరుగ్గా ఉండటంతో కొబ్బరి వర్తకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదారేళ్ళుగా కొబ్బరి మార్కెట్ ధరల్లో నిలకడ లేకపోవడం, 2018, 19 ప్రాంతాల్లో కాయ ధర కనిష్టంగా రూ.5 రూపాయలు పడిపోవడంతో వ్యాపారులు నష్టాలు చవి చూశారు. గత ఏడాది కాలంగా కొబ్బరి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. దీంతో కొబ్బరి నిల్వ చేసిన వర్తకుల పంట పండింది. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వారి కొబ్బరి కొనుగోళ్ళను వర్తకులు ముమ్మరం చేశారు. రైతులు వద్ద కొబ్బరికాయలను కొబ్బరి వర్తకులు పోటీ పడి కొనుగోలు చేస్తున్నారు. గడిచిన వేసవిలో కొబ్బరి దిగుబడి గణనీయంగా పడిపోయింది. కొంత మంది రైతులు ఐదారు నెలలు పాటు కొబ్బరి దింపు తీయలేదు. ఇపుడు గతం కంటే దిగుబడి కొంత మేర పెరగడం, ధరలు ఆశాజనకంగా ఉండటంతో కొబ్బరి రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు ఉద్యాన శాఖ నుంచి కొబ్బరి రైతులకు ఏ విధమైన సహాయం అందడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించడం లేదు. రైతులకు సూచనలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేరళ తరహాలో సబ్సిడీపై ఎరువుల అందించాలని రైతులు కోరుతున్నారు.

నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్‌కు సానుకూలం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం, సెప్టెంబరు 20: నరసాపురం మచిలీపట్నం మధ్య ఇటీవల బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొత్త రైల్వేలైన్ నిర్మాణంపై రైల్వే చేపట్టిన సర్వే అనుకులంగా ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ చెప్పారు. నరసాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొగల్తూరు- బంటుమిల్లు మీదుగా మచిలీపట్నం వరకు చేపట్టే కొత్త రైల్వేలైన్‌కు అయ్యే ఖర్చు, భూసేకరణ, ప్రయాణికుల రద్దీ, ఇతర రూట్లలోని మార్గాలతో అనుసంధానం తదితర అంశాలపై రైల్వే ప్రాథమిక సర్వే చేసిందన్నారు. మరో 15 రోజుల్లో ఈ నివేదిక ఢిల్లీలోని రైల్వే బోర్డుకు వెళ్లతుందన్నారు.తరువాత ఈ ప్రాజెక్టుకు క్లియరెన్స్ వస్తుందని మంత్రి చెప్పారు.రాష్ట్ర విభజన తరువాత ఏపీ నుంచి వారాణసీ వెళ్లేందుకు ప్రత్యేక రైలు లేదు, ప్రస్తుతం విశాఖ నుంచి ఒక రైలు నడుస్తున్నా అది విజయనగరం జిల్లా వాసులకే తప్ప మిగిలిన జిల్లా వాసులకు పెద్దగా ఉపయోగం ఉండటం లేదు. దీన్ని పరిగణలోకి తీసుకుని నరసాపురం నుంచి నడపాలని రైల్వే మంత్రిని కోరినట్లు శ్రీనివాసవర్మ చెప్పారు. లేదా నరసాపురం నుంచి మరో రైలును నడిపితే ఉభయగోదావరి జిల్లా వాసులతో పాటు కృష్ణా, గుంటూరు ఇతర జిల్లా వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటితో పాటు నరసాపురం నుంచి వందే భారత్ నడపాలని కోరామన్నారు. ఇది కాకుండా చెన్నై విజయవాడల మధ్య నడుస్తున్న వందే భారత్ నరసాపురం లేదా భీమవరం వరకు పొడిగించాలని విన్నవించామన్నారు. మరో మూడు నెలల్లో వీటిపై క్లారిటీ వస్తుందని చెప్పారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఇవికాకుండా నరసాపురం నుంచి ప్రతి ఆదివారం హైద్రాబాద్‌కు నడుస్తున్న స్పెషల్, వీక్లి బెంగుళూరు స్పెషల్‌ను కూడా రెగ్యూలర్ చేయాలని మంత్రిని కోరామన్నారు. కోటిపల్లి రైల్వేలైన్ పనులు గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. రాష్ట్రవాటాగా ఒక్క రూపాయి కూడా వైసీపీ చెల్లించలేదన్నారు. ఇప్పటి వరకు రైల్వే ఈ ప్రాజెక్టుకు రూ.1200 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కోనసీమ జిల్లాలో భూసేకరణ పెండింగ్ పడిందన్నారు. దిగమర్రు నుంచి పామర్రు వరకు చేపట్టే 165 జాతీయ రహదారి పనుల్ని వేగవంతం చేస్తామన్నారు. భీమ వరం, ఉండి రహదారిలో పెండింగ్ పడిన వంతెన పనుల్ని వచ్చే నెలలో మొదలు పెడతామని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే నాయకర్, ఆర్డీవో అంబ రీస్, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, వీవీఆర్‌లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో పూర్తిస్థాయి ప్రక్షాళనకు చర్యలు

రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

నూజివీడు/నూజివీడు టౌన్,సెప్టెంబరు 20 : నూజివీడు ట్రిపుల్ ఐటీ లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్న కారణంగా రెండు నెలలుగా వారు అనారోగ్యం బారిన పడడం, విద్యార్థుల ఫిర్యాదుపై జిల్లా అధికారులు, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకస్మిక తనిఖీలు చేసి ఆహారం నాణ్యత లేదని నిర్ధారించిన విషయం విధితమే. ఉన్నతాధికారుల కమిటీ బృందం శుక్రవారం ట్రిపుల్ ఐటీని సందర్శించింది. కలెక్టర్ కె.వెట్రి సెల్వితో కలిసి భాస్కర్ ఒకటో నంబరు మెస్‌ను అక్కడ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భోజన పదార్థాల తయారీ,పారిశుధ్య నిర్వహణ, సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం సమావేశపు హాలులో ట్రిపుల్ ఐటీ అధికారులు, కలెక్టర్‌తో సమీక్షించారు. ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. పూర్తి స్థాయి ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మెస్ కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త టెండర్లు పిలవాలి.ఆహార నాణ్యతను, పారిశుధ్యాన్ని పర్యవేక్షించటానికి కమిటీలు ఏర్పాటు చేయాలి. కమిటీలో పౌష్టికాహార నిపుణులు, ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థి ప్రతినిధులు సభ్యులుగా ఉండాలి. కమిటీ ప్రతివారం సమీక్షించుకుని ఆహార పదార్థాల తయారీ, సరుకుల నాణ్యతను యాప్‌లో నమోదు చేయాలి. నాణ్యతలో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే కాలేజీ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకురావాలి. ప్రాంగణంలో సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉండాలని సూచిం చారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మెన్ రామ్మోనరావు, ఆర్డీవో భవానిశంకరి, వైస్ ఛాన్స్‌లర్ ఎం.విజయ్‌కుమార్, రిజిస్ట్రార్, ఇన్‌చార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్, బండి ప్రసాద్ పాల్గొన్నారు.



మెస్‌లో భోజన సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

రిజిస్ట్రేషన్లకు రీసర్వే చిక్కులు

ఎల్‌పీ నెంబరు వచ్చినా రిజిస్ట్రేషన్లు అవక రైతుల ఇబ్బందులు

ఆచంట, సెప్టెంబరు 20: రిజిస్ట్రేషన్ శాఖలో నిబంధనల వల్ల భూములు, స్థలాలు అమ్మకాలు, కొనుగోలు విషయంలో కక్షిదారులు తరచూ అనేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇటీవల లావాదేవీలు తగ్గిపోయాయి. ప్రభుత్వం సుమారు సంవత్సరం క్రితం వ్యవసాయ భూములకు సంబంధించి భూముల రీసర్వే విధానాన్ని పెట్టింది. అయితే సర్వే చేసిన అనంతరం అధికారులు ఆయా సర్వే నంబర్లకు సంబంధించి ఎల్‌పీ నెంబర్లు కేటాయించారు. ఎల్‌పీ నెంబరు కేటాయించిన భూముల సర్వేకు సంబంధించి కొన్ని నెలల పాటు రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఆచంట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆచంట, పెనుగొండ, పోడూరు మూడు మండలాలకు సంబంధించి 20 గ్రామాలు ఆచంట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఉన్నాయి. అయితే ఆచంట మండలంలోని కొడమంచిలి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, గ్రామాలు పోడూరు మండలంలో రావిపాడు, మినిమించిలిపాడు గ్రామాలు, పెనుగొండ మండలంలో ములపర్రు గ్రామాలకు సంబంధించి రీ సర్వే నెంబర్లకు సంబంధించి ఎల్‌పీ నంబర్లు కేటాయించారు. ఈ గ్రామాలకు సంబంధించి ఏడు నెలలుగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. భూములు అమ్మాలన్నా, ఇంటిలో వారికి సెటిల్‌మెంటు దస్తావేజు రాయాలన్నా, పెళ్ళి దస్తావేజులు రాయాలన్నా రిజిస్ట్రేషన్‌లు జరగలేదు. ఇటీవలే ఎల్‌పీ నెమ్మదిగా రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. అయితే శుక్రవారం రిజిస్ట్రేషన్ ఆగిపోయాయి.ప్రభుత్వం ఎల్‌పీ నెంబర్లు తొలగిస్తారనే ప్రచారం ఉండటంతో దానికనుగుణంగానే డేటా అవడం లేదని సమాచారం.



నెల రోజులుగా రిజిస్ట్రేషన్లు లేవు

ఆచంట మండలం పెదమల్లం గ్రామానికి సంబంధించి భూములు రీ సర్వే చేయలేదు. అయినప్పటికి నెల రోజులుగా ఈ గ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సర్వే నెంబరుకు సంబంధించి డేటా వివరాలు అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులను అడిగినప్పటికి సాంకేతిక సమస్య అని ఒకరు, మా పరిధిలో ఎటువంటి ఇబ్బంది లేదని మరొకరు చెపుతూ వస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకుని కక్షిదారులకు ఇబ్బందులు లేకుండా సజావుగా రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

క్రైమ్ కార్నర్

అనారోగ్యం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 20 : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ పరిధిలోని బీడీ కాలనీలో ఉన్న ద్వారకానగర్‌కు చెందిన తమ్మా కోటి నాగేశ్వరరావు (68) భార్య నాలుగు సంవత్సరాల క్రితం మరణించింది. అతనికి ఒక కుమారుడు ఉన్నాడు. కుమారుడు మద్యానికి బానిస కావడంతో కోడలు పుట్టింటికి వెళ్ళిపోయింది.అనారోగ్యంతో బాధపడుతున్న నాగేశ్వరరావు బాధను భరించలేక శుక్రవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరి వేసుకున్నాడు. అతను కనిపించడం లేదని చుట్టుపక్కల వారు చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. అతని కుమారుడు నాలుగు రోజుల క్రితం రాజమహేంద్రవరం ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం వెళ్ళాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మోటార్ సైకిల్ ఢీకొని బాలుడికి గాయాలు

ఉండి సెప్టెంబరు 20: మోటర్ సైకిల్ ఢీకొని ఒక బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో కొల్లి రక్షణబాబు (9)అనే బాలుడు కొత్త చర్చి ఎదురుగా రోడ్ మీద వుండగా వెనుకవైపు నుంచి వచ్చిన మోటర్ సైక్లిస్ట్ బలంగా ఢీకొట్టడంతో బాలుడి తలకు తీవ్ర గాయమైంది. భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ నజీరుల్లా తెలిపారు.

చేపల లోడు లారీ బోల్తా..పలువురికి గాయాలు

ఉంగుటూరు, సెప్టెంబరు 20 : ఉంగుటూరు మండలం నారాయణపురం జాతీయ రహదారిపై శుక్రవారం ట్రక్ ఆటోను ఢీకొని చేపల లోడ్‌తో వెళుతున్న కంటెయినర్ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ట్రక్కు ఆటో డివైడర్ మధ్యలోకి వెళ్ళి పడింది. కంటెయినర్‌లో ప్రయాణిస్తున్న చేపల పట్టుబడి కార్మికులతో పాటు డ్రైవర్, గుమస్తాలకు గాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పిచ్చి కుక్క దాడి..ఐదుగురికి గాయాలు

రెండు కుక్క పిల్లలు మృతి





పోలవరం, సెప్టెంబరు 20 : పోలవరంలో శుక్ర వారం పిచ్చికుక్క దాడి చేసి గ్రామంలో ఐదు గురిని తీవ్రంగా గాయపరిచింది. రెండు కుక్కపిల్లల్ని చంపివేసింది. పోలవరం పంచాయతీ గణేశ్ నగర్‌కి చెందిన ఐదేళ్ళ చిన్నారి పసుపులేటి వెంకటరమణని, బీసీ కాలనీకి చెందిన గౌస్ మెహిద్దీన్‌లను పిచ్చికుక్క గాయ పరిచింది. రెండు చిన్న కుక్కపిల్లల్ని కరవడంతో చనిపోయాయి. ప్రగడపల్లి గ్రామానికి చెందిన విజయకుమార్, పైడిపాక చంద్రన్న కాలనీకి చెందిన తిరు మలశెట్టి శ్రీరమణి , ఎన్టీఆర్ కాలనీకి చెందిన అప్పలాచారిలను కూడా కరవడంతో గాయాలపాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు వైద్యాధికారి కృష్ణంరాజు తెలిపారు. గ్రామంలో ఒకేరోజు ఐదుగురిని పిచ్చి కుక్క కరవడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. పంచాయతీ సిబ్బంది కుక్కని పట్టుకోవ డానికి ప్రయత్నించి విఫలమయ్యారు. గ్రామస్థులు బయటకు వెళ్ళడానికి భయపడిపోతు న్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్క బెడద వదలిం చాలని గ్రామంలో ఊర కుక్కలను పట్టించి దూరంగా విడిచి పెట్టాలని కోరుతున్నారు.

గంజాయి నియంత్రణకు కృషి : ఐజీ అశోక్‌కుమార్



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెం బరు 20: రాష్ట్రంలో గంజాయి నియం త్రణపై ప్రత్యేక దృష్టి సారిం చామని ఏలూరు రేంజి ఐజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం పరిశీలించారు. ఏలూరు రేంజ్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పోలీస్‌స్టేషన్ భవణాల ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. జిల్లాకు సైబర్ క్రైం స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. సోషల్ మీడియా మోసాల బాధితులకు అండగా ఉండేందుకు, బాధితులకు అవగాహన కల్పించేందుకు స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్పీ నయీం అస్మి, డీఎస్పీ మూర్తి, సీఐలు రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



చందు కుటుంబీకులకు సాయం అందిస్తున్న చంద్రబాబు

కార్యకర్త కుటుంబానికి బొలిశెట్టి, చంద్రబాబు చేయూత

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 20: తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి మాజీ ఎంపీటీసీ పసుమర్తి చందు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందగా ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.5 లక్షలు నగదును శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందించారు. చందు కుటుంబ పరిస్థితి తెలిసిన చంద్రబాబు నాయుడు తన తరఫున రూ.3 లక్షలతో పాటు ఆయన పిల్లల చదువుకు అవసరమైన సొమ్ము అందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం పాల్గొన్నారు.



నూతన సభ్యులను ఆహ్వానిస్తూ కండువా కప్పుతున్న నాయకురాలు

అంగన్‌వాడీ కార్యకలాపాలు ఒకే యాప్‌లో ఉండాలి

చింతలపూడి, సెప్టెంబరు 20 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు సంబంధించిన యాప్‌లన్నీ ఒకే యాప్ లోనికి తీసుకురావాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఏఐటీయుసీ)జిల్లా అధ్యక్షురాలు గంధం అంజమ్మ విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో యూనియన్‌లోకి నూతన సభ్యులను ఆహ్వానిస్తూ జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే రకరకాల యాప్‌లు వారిచ్చిన ఫోన్లలో పనిచేయడం లేదని యాప్‌లన్నీ ఒకే యాప్‌లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



వివరాలు తెలుపుతున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్

బాలిక అత్యాచారం కేసులో వార్డెన్, అతని భార్య, మేనకోడలు అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 20 : బాలికపై అత్యాచారానికి పాల్పడిన వార్డెన్‌తో పాటు అతనికి సహకరించిన అతని భార్య, మరో యువతిని అరెస్టు చేసినట్టు ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు.శుక్రవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరులో ఉన్న సేవాశ్రమం బాలికల వసతి గృహాన్ని గతంలో శ్రీస్వామి దయానంద సరస్వతికి సం బంధించిన ఎయిమ్ ఫర్ సేవా ఆలిండియా మూమెంట్ ఫర్ సేవా అనే ట్రస్టును నిర్వహిస్తున్నది. అమెరికాకు చెందిన గురుకృత అనే సంస్థ భవన నిర్మాణానికి నిధులను సమకూర్చింది. 2018లో ఈ ట్రస్టు రిజిస్ట్రేషన్ చేయిం చుకున్నారు. అయితే బాలికల వసతి గృహం నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు పొందలేదన్నారు. తొలుత శేషం రాజు అనే వృద్ధుడు మేనేజర్‌గా వ్యవహరించేవాడు. అతని వద్దకు ఏలూరు గ్రీన్ సిటీలో నివాసం ఉంటున్న బొమ్మిరెడ్డిపల్లి శశికుమార్ (56) తరచుగా వెళ్ళేవారు. తాను చింతలపూడి మండలంలోని వసతి గృహంలో వార్డెన్‌గా పనిచేస్తున్నానని తనకు ఎంతో అనుభవం ఉందని పార్టు టైమ్‌గా అక్కడ ఉద్యోగం చేస్తానని చెప్పుకొచ్చాడు. పురుషులకు అవకాశం లేదని చెప్పడంతో అతని భార్యకు అవకాశం ఇవ్వమని కోరడంతో అతని భార్య ఫణిశ్రీకి(52) వార్డెన్‌గా అవకాశం కల్పించారు. తన మేనకోడలు బయ్యారపు లావణ్య (20)ను పరిచయం చేసి కేర్ టేకర్‌గా ఉద్యోగం ఇప్పించారు.యాజమాన్యానికి శేషంరాజుపై చెడుగా చెప్పి అతనిని అక్కడ నుంచి తొలగించారు. అక్కడ పరిస్థితి అంతా తన చేతిలోకి వచ్చేలా చూసుకున్నారు. శశికుమార్‌కు ఏలూరులో మణి డిజిటల్స్ అనే ఫోటో స్టూడియో కూడా ఉంది. ఆ వసతి గృహంలో చదివే విద్యార్థినులకు ఫోటో గ్రఫీపై మక్కువ కల్పించి వారికి నేర్పిస్తానని నమ్మబలికి వేరే ప్రాంతా లకు తీసుకువెళ్తా ఉండేవాడు. అదే క్రమంలో ఈనెల 15న ఆ వసతి గృహంలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థినిని లావణ్య, ఫణిశ్రీలు బలవంతంగా తీసుకువెళ్ళి శశికుమార్ కారులో ఎక్కించారు. అతను కారులో బాపట్ల తీసుకువెళ్ళి అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక జరిగిన సంఘటనను తల్లి దండ్రులకు, తోటి విద్యార్థులకు చెప్పడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన శశికుమార్, అతని భార్య ఫణిశ్రీ, కేర్ టేకర్ లావణ్యలను శుక్రవారం శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేశామని ఎస్పీ చెప్పారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, టూటౌన్ సీఐ రమణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఆది ప్రసాద్, నిడమర్రు ఇన్‌స్పెక్టర్ సుభాష్, మహిళా ఎస్ఐ నాగ కల్యాణిలను ఎస్పీ అభినందించారు.

శ్రీవారి లడ్డూను కల్తీ చేసిన వారిని శిక్షించాలి

భీమడోలు, సెప్టెంబర్ 20 : తిరుపతి శ్రీవారి లడ్డూల తయారీలో అప్పటి వైసీపీ ప్రభుత్వం కల్తీకి పాల్పడడంపై భీమడోలు మండల బీజేపీ తీవ్రంగా ఖండించింది. భీమడోలు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌పటేల్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించింది. పవిత్రకు చిహ్నంగా భక్తి శ్రద్ధలతో స్వామి ప్రసాదాన్ని పూజిస్తామని అటు వంటి ప్రసాదం తయారీ అపవిత్రం పాలు చేసిన వారిని వెంటనే శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జంగారెడ్డిగూడెం: వెంకటేశ్వరస్వామి తిరుపతి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి హిందువుల మనోభావాలను దెబ్బ తీసినవారిని కఠినంగా శిక్షించాలని చింతలపూడి నియోజకవర్గ టీడీపీ మాజీ కన్వీనర్ మండవ లక్ష్మణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను చేసిన తప్పును అప్పటి సీఎం జగన్ కప్పి పుచ్చుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను విమర్శించడం సరికాదన్నారు.

ఏలూరు రూరల్: కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం తిరుమలలో గడిచిన ఐదు సంవత్సరాలలో లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని అఖిల భారత బ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్ ఎంబీఎస్ శర్మ డిమాండ్ చేశారు. యావత్ హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులపై కూడా విచారణ చేసి హిందువుల మనోభావాలు కాపాడే విధంగా తగిన రీతిలో దర్యాప్తు చేయాలని కోరారు.

దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 : స్థానిక గొల్లాయిగూడెం, లక్ష్మమ్మకోనేరు కాలనీల్లో శుక్రవారం దోమలవ్యాప్తి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ ప్రజలకు హానిచేసే దోమలు మంచినీటి నిల్వలున్న ప్రాంతాల్లోనే వృద్ధి చెందుతాయని అన్నారు. స్థానికులకు కరపత్రాలు పంచారు. అంగన్‌వాడీకేంద్రంలో చిన్నపిల్లలకు చేతుల పరిశుభ్రతవిధానంపై మెళకువలు నేర్పించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నవ్య, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, రమేష్‌బాబు, భూలక్ష్మి, హసీనా, శ్రీదేవి, సౌజన్య రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల 'పని సర్దుబాటు' జీవో ఉపసంహరించాలి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 : మున్సిపల్ ఉపాధ్యాయులను సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతాలకు సర్దుబాటు చేయడానికి కారణమైన జీవో 84 ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని శుక్రవారం ఏలూరులోని సుబ్బమ్మదేవి హైస్కూలులో జరిగిన ఏపీటీఎఫ్ నగరశాఖ సమావేశంలో ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు మాట్లాడుతూ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్లను మండల స్థాయికే పరిమితంచేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఏకపక్షంగా డివిజన్‌స్థాయి పాఠశాలలకు సర్దుబాటుచేయడంవల్ల చాలామంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

రిపోర్టు చేయకుంటే తొలగిస్తాం: డీఈవో

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 : అనధికారికంగా 2019 ఆగస్టు ఒకటో తేదీ నుంచి విధులకు గైర్హాజరవుతున్న పెదవేగి మండలం కే.గార్డెన్స్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.సత్యప్రసాద్ ఏడు రోజుల్లోగా జిల్లా విద్యాశాఖాధికారి ముందు వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయడంలో విఫలమైతే తదుపరి ఎటువంటి నోటీసులేకుండా అయనను సర్వీసు నుంచి తీసివేస్తామని డీఈవో అబ్రహం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన ఆచూకీ కోసం ఎంఈవో ద్వారా ఇప్పటికే పలుమార్లు ప్రయత్నించినా సాధ్యపడలేదని, ఈ ఏడాది ఏప్రిల్ 15న షోకాజ్ నోటీసు జారీ చేసినా స్పందనలేదన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెదపాడు, సెప్టెంబరు 20 : నాయుడుగూడెంలో ఎస్టీ కుటుంబాలకు చెందిన గుడిసెలు ఇటీవల వరద ప్రభావంతో ముంపునకు గురయ్యాయి. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ గోశాల ఝాన్సీ ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు బియ్యం, పప్పులు, వంటనూనె తదితర నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు.

భూమి రికార్డుల సమగ్ర పరిశీలన

పెదపాడు, సెప్టెంబరు 20 : భూమి రికార్డులను సమగ్రంగా పరిశీలన చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందిస్తామని ఆర్డీవో, భూ రీసర్వే వెరిఫికేషన్ చైర్మన్ కె.అద్దయ్య అన్నారు. పెదపాడు తహసీల్దారు కార్యాలయంలో పెదపాడు మండలానికి సంబంధించి వివిధ రెవెన్యూ గ్రామాల భూ పట్టాల రికార్డులను ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్‌బాబుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆర్డీవో అద్దయ్య మాట్లాడుతూ మండల పరిధిలో వున్న షరతుల పట్టాల రీ వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని, మండలంలో 332 సర్వే నెంబర్లలో 300.99 ఎకరాలు, 368 రైతులకు సంబంధించి రికార్డులు పరిశీలించడం జరుగుతుందన్నారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించండి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 20: మాదిగ సామాజిక వర్గానికి ద్వారకాతిరుమలలో ఒక భవన నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును మండల మాదిగ ఉద్యోగ సంఘ ప్రతినిధులు, యువత కోరారు. నల్లజర్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే సామాజిక భవన నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయి స్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కుంకుళ్లమ్మ ఆలయంలో పూల పరిమళాలు



ఆలయం పరిసరాల్లో ఎదుగుతున్న గులాబి మొక్కలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 20: క్షేత్ర దేవతగా కొలువుదీరిన శ్రీకుంకుళ్లమ్మ ఆలయ పరిసరాలు పచ్చదనంతో వెల్లివిరుస్తున్నాయి. రంగురంగుల పూల మొక్కలతో ఆహ్లాదాన్ని నింపుతున్నాయి. చిన వెంకన్న దర్శనార్థం వచ్చే భక్తుల్లో 80 శాతం మంది పొలిమేర దేవతైన కుంకుళ్లమ్మను దర్శిస్తారు. ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని ఇచ్చేందుకు ఇటీవల ఆలయ అధికారులు చర్యలు చేపట్టి గులాబీలను నాటారు.

28న ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్లకు తుది గడువు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 : ఏపీ ఓపెన్ స్కూల్స్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 28 వరకు మరోదఫా పొడిగించినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.200లు అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకునే గడువు 30వ తేదీ వరకు ఉందన్నారు. ఏపీ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

మహిళలు యోగా చేయాలి



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 20: పోష కాహార మహోత్స వాల్లో భాగంగా ద్వార కాతిరుమల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు యోగా అవసరమని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. చిన్నచిన్న యోగాసనాలు చేయడం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉండొచ్చని వివరించారు. గర్భిణులతో సూక్ష్మ వ్యాయామాలు, నాడీ శుద్ధి, ప్రాణాయామాలు చేయించారు. సీడీపీవో బ్యూలా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ, మహిళా పోలీస్ లక్ష్మీసుజన పాల్గొన్నారు.

వీఆర్ఏలకు కనీస వేతనం ఇవ్వాలి

కుక్కునూరు, సెప్టెంబరు 20: వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా పని చేస్తున్న వీఆర్ఏలు చాలీచాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

మైనారిటీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి



నిడమర్రు సెప్టెంబర్ 20: రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి బలోపేతం చేయాలని మంత్రి మహ్మద్ ఫరూక్‌కు నిడమర్రు టీడీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం అమరావతిలో మంత్రి ఫరూక్‌ను కలిశారు.






జంగారెడ్డిగూడెంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం.. ఏలూరులో ఎమ్మెల్యే చంటి కరపత్రాల ప్రదర్శన.. దెందులూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని.. పి.రాజవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

వందరోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమం

కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం

భీమడోలు, సెప్టెంబర్ 20 : వంద రోజుల్లో సాధించిన కూటమి విజయాలపై ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ప్రజలకు వివరించే ఈ కార్యక్రమాన్ని భీమడోలులో ప్రారంభించారు. తొలుత ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్‌యాక్టు రద్దు, 1వ తేదీన పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు, వరదల్లో దెబ్బ తిన్న వారికి అత్యవసర సాయంతో పాటు ప్యాకేజీ వంటివి విజయవంతంగా పూర్తి చేశారన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ బండ పథకాన్ని ప్రారంభించనున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వంద రోజులు చేసిన మంచిని తెలుపుతూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

ఏలూరు టూటౌన్: ఎన్నికల హామీల్లో భాగంగా రానున్న ఆరునెలల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కూటమి ప్రభుత్వం 100రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 47వ డివిజన్‌లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ అర్హులందరికి పింఛన్లను ఇప్పిస్తామన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తామని అన్నారు.

జీలుగుమిల్లి: పి.రాజవరంలో పంచాయతీ కార్యాలయం వద్ద కూటమి నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో అమలు చేసిన పలు అభివృద్ధి పనుల్ని ప్రజలకు వివరించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, నాయకులు బొరగం శ్రీనివాస్, గడ్డమణుగు రవికుమార్, పారేపల్లి రామారావు, పసుపులేటి రాము పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అభివృద్ధి సంక్షేమాల్లో వెయ్యడుగులు వేసిందని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. శుక్రవారం గుర్వాయిగూడెం మండల బీసీ సెల్ అధ్యక్షుడు బూసా సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, చిట్రోజు తాతాజీ, చేను ప్రసాద్, కుక్కల మాదవరావు పాల్గొన్నారు.

కామవరపుకోట: ప్రజలు ఎంతో ఆశ పెట్టుకుని అరాచక పాలనకు స్వస్తి పలికి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సమర్థవంతంగా పరిపాలన కొనసాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం, పార్టీ సరఫరా చేసిన మంచి ప్రభుత్వం బ్రోచర్లను మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఆవిష్కరించారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, టీడీపీ నాయకులు తూతా లక్ష్మణరావు, బొప్పన అంజియ్య, బొంతు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దెందులూరు: గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసినప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తీరతామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం దెందులూరులోని టీడీపీ కార్యాలయంలో సర్పంచ్ తోట యేసమ్మ, మండల అధ్యక్షుడు మిల్లుబాబు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి చైతన్యకృష్ణ, జనసేన నాయకులతో కలిసి 100 రోజుల పరిపాలనపై మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్‌సిలిండర్ పంపిణీతో పాటు అన్ని పథకాలు హామీలను అమలు చేస్తామన్నారు.

ఉంగుటూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యి వంద రోజులైన నేపథ్యంలో శుక్రవారం నాడు పలు గ్రామాలలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కైకరం, చేబ్రోలు, కాకర్లమూడి, నాచుగుంట తదితర గ్రామాలలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సలగాల గోపి, రాంధే లక్ష్మీ సునీత, కాళ్ల నాగ పండు, ఎంపీటీసీలు చెన్ను సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా వర్షం

ఉరుములు మెరుపులు, ఈదురు గాలులు



ద్వారకా తిరుమలలో పడుతున్న వర్షం

అప్పటి వరకు ఎండ వేడి, ఉక్కపోత.. ఒక్క సారిగా వాతావరణం మారి పోయింది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడింది. అకస్మాత్తుగా మేఘాలు కమ్ముకుని ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దాదాపు అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. అనేక ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పోలవరం: పోలవరం మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పాఠశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు స్థానిక బస్ షెల్టర్‌లో తలదాచుకుని వర్షం తగ్గిన తర్వాత ఇళ్లకు వెళ్లారు. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు

పెదపాడు: తీవ్రమైన ఎండవేడితో అల్లాడుతున్నవారికి శుక్రవారం కురిసిన వర్షం కొంత ఉపశమనం కలిగించింది. ఉదయం రెండు గంటల పాటు జల్లులతో కూడిన వర్షం కురవడంతో వేడిగా వున్న వాతావరణం కాస్త చల్లబడింది. వరిసాగు చేసి సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు వర్షం కాస్త ఊరటనిచ్చింది.

ద్వారకాతిరుమల: అప్పటివరకూ ఎండతో సతమతమైన భక్తులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో సేదతీరారు. ఉరుములు, మెరుపులతో ఆగకుండా వాన దంచి కొట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులు వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు.

జీలుగుమిల్లి: జీలుగుమిల్లిలో శుక్రవారం వర్షం కురిసింది. ఇటీవల వరుస తుఫాన్‌లతో వచ్చిన వరదల వల్ల రైతులు నష్టపోయామని, ప్రస్తుతం వర్షాలు కురిస్తే మరింత నష్టం వాటిల్లనున్నట్లు రైతులు వాపోతున్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట : ఎస్పీ



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 20 : విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని వారి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేపీఎస్ కిషోర్ అన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్‌లలోని సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు వారి సమస్యలపై వినతిపత్రాలను ఎస్పీకి అందించారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది ఎలాంటి ఇబ్బంది పడకుండా సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రజలకు పోలీస్‌శాఖ మెరుగైన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామన్నారు.

రెడ్‌బుక్ పాలనలో ప్రజలకు రక్షణ లేదు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనలో ప్రజలకు ముఖ్యంగా మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని, రెడ్‌బుక్ పాలన కాస్తా బ్లడ్ బుక్ పాలనగా మారి 100 రోజులు పూర్తిచేసుకోవడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం దుద్దుకూరులో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు వైసీపీ శ్రేణులను లక్ష్యం చేసుకుని హింసాత్మక ఘటనలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకిచ్చిన సూపర్ 6 పథకాలు అటకెక్కాయని అన్నారు. పవిత్రమైన టీటీడీని భ్రష్టు పట్టించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామివారితో పెట్టుకున్న వారు ఎవరూ బాగుపడిన సందర్భాలు లేవని అన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 20: కేతవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమం శుక్రవారం సెక్టార్ సూపర్‌వైజర్ కె.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా పౌష్టికాహారం పై గర్భిణులు,బాలింతలకు అవగాహన కల్పించారు.

నిమజ్జన విగ్రహాల తొలగింపు పనులు

పోలవరం, సెప్టెంబరు 20: గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలో పలు గ్రామాల నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి పట్టిసీమ ఫెర్రీ రేవులో నిమజ్జనం చేసిన విగ్రహాలను శుక్రవారం పట్టిసీమ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి మాట్లాడుతూ నిమజ్జనం చేసిన విగ్రహాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోకుండా మెట్లపైనే ఉండిపోయాయని కార్తీకమాసం భక్తుల పూజలు స్నానాలు, పట్టిసీమ శివక్షేత్రానికి రాకపోకలు సాగించేందుకు విగ్రహాలు అవాంతరాలుగా ఉన్న నేపథ్యంలో సిబ్బందితో తొలగించడం జరిగిందని తెలిపారు. సుమారు 120 భారీ విగ్రహాలను మెట్ల మార్గం నుంచి తొలగించినట్లు తెలిపారు.

సర్వేలో అవకతవకలంటూ రైతుల ఆందోళన



తహసీల్దారుకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

పోలవరం సెప్టెంబరు 20: మండలంలో ఇటీవల వరదలు, వర్షాల ప్రభావంతో ముంపునకు గురై పంట నష్టపోయిన రైతుల పంటల సర్వే విషయంలో మండల వ్యవసాయాధికారి అవకతవకలకు పాల్పడ్డారని శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. పంటనష్టం అంచనాలు చేసే విషయంలో వ్యవసాయాధికారి కొంతమంది రైతులతో కమీషన్లు మాట్లాడుకుని ఎలాంటి నష్టం జరగని పంటల రైతులను, అసలు పంట వేయని రైతుల పంటపొలాలను లబ్ధిదారుల జాబితాలో చేర్చి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేశారని తెలిపారు. తహసీల్దారు సాయిరాజు మాట్లాడుతూ పంట నష్టం రీ సర్వే వేరే బృందాలతో చేయించి రైతులకు తగు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు కొణతాల ప్రసాద్, చెంచాని రత్నప్రసాద్ ఉప సర్పంచ్ కోరశిక శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కైకరంలో హైజంప్ పోటీలు

ఉంగుటూరు, సెప్టెంబరు 20: కైకరం హైస్కూలులో శుక్రవారం మండల స్థాయి హైజంప్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో మండల క్రీడల సమన్వయకర్త ఎం.బి.ఎల్.నారాయణ, పి.డి.లు పాల్గొన్నారు.

సామూహిక శ్రీచక్ర కుంకుమార్చన



ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 20 : భాద్రపద మాసంలోని మూడవ శుక్రవారం కావడంతో సత్రంపాడులోని శ్రీ అంబికాదేవి ఆలయంలో అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ మహిళలతో సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ జరిపారు.

3 నుంచి సౌభాగ్యలక్ష్మి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 20 : సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు ఊటుకూరి సాయిబాబా శర్మ కమిటీ నాయకులు చినబాబు, జి.ఎస్.ఎన్.కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈ ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, సామూహిక పారాయణలు జరుపుతామన్నారు. అమ్మవారికి రోజుకో అలంకారం జరిపి భక్తులకు దర్శనమిస్తామన్నారు.

జాబ్‌మేళాలో 55 మంది ఎంపిక

కామవరపుకోట, సెప్టెంబరు 20 : తడికలపూడిలోని మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 124 మంది యువకులు హాజరుకాగా వారిలో 55 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఘంటా సుధాకర్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అరబిందో ఫార్మా, బజాజ్ క్యాపిటల్, అమెజాన్, జెనియస్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. ఎంప్లాయిమెంట్ అధికారి మధుసూధనరావు, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ రెబికో శామ్యూల్, సీడీపీవో పి.బ్యూలా, ప్రవీణ్, కార్తీక్ పాల్గొన్నారు.

దుద్దేపూడిలో పొలంబడి

భీమడోలు, సెప్టెంబర్ 20 : దుద్దేపూడి గ్రామంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అగ్నిఅస్త్రం మందు తయారీని రైతులకు మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి వివరించారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈనెల 21వ తేదీ నుంచి అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ ఎలుకల నివారణ మందు అందుబాటులో ఉంటుందన్నారు.

పాతూరులో స్వచ్ఛతా హీ సేవా

భీమడోలు, సెప్టెంబర్ 20 : పాతూరు జెఎంఎంపురం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం నిర్మలకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తడిచెత్త పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్త నుంచి ఎరువులు తయారు చేసే విధానాలను స్వచ్ఛతాహీ సేవా సూపర్‌వైజర్ సయ్యద్ వివరించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఉంగుటూరు, సెప్టెంబరు 20: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నాడు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో సెట్వెల్ సి.ఈ.వో. ప్రభాకర్, ఎంప్లాయిమెంట్ జిల్లా అధికారి మధుసూధనరావు, యంగ్ ప్రొఫెషనలిస్ట్ గట్టిం ప్రవీణ్ కృష్ణ, బొల్లా శ్రీకాంత్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత కళాశాల ప్రాంగణంలో అతిథులు మొక్కలు నాటారు.

సబ్ జైలు తనిఖీ



వంట శాలను తనిఖీ చేస్తున్న రత్నప్రసాద్

చింతలపూడి, సెప్టెంబరు 20: ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. నిందితుల కేసుల వివరాలు వారికి అందుతున్న ఆహారం, వైద్య, ఆరోగ్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు అందించిన సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగారాల పర్యవేక్షణ అధికారి కృపానందం, న్యాయవాదులు ఏసుపాదం, డేవిడ్ రాజు, సోషల్ వర్కర్ ఎండి అక్బర్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ జరపాలి



ఏలూరులోని ఆశ్రమంలో ప్రజాసంఘాల నాయకులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20: బాలికలపై హాస్టల్ వార్డెన్ లైంగిక వేధింపుల ఉదంతంపై శుక్రవారం అమీనాపేటలోని స్వామి దయానంద సరస్వతి ఆశ్రమాన్ని పీడీఎస్‌యు, పౌరహక్కుల సంఘం నాయకులు సందర్శించారు. వివరాలను పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నాని మీడియాకు విడుదల చేశారు. హాస్టల్ వార్డెన్ శశికుమార్ మనిషిరూపంలోవున్న కామాంధుడని విద్యార్థినుల తల్లిదండ్రులు నిజనిర్ధారణ బృందం వద్ద వాపోయారని వివరించారు. ఈ కేసులో పెద్దలను కాపాడేప్రయత్నం జరుగుతున్నట్టుగా అనుమానాలు ఉన్నాయన్నారు. వెంటనే ఈ కేసుని సీబీఐకి అప్పగించి పూర్తిస్థాయిలో సమగ్రవిచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 20: అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. శనివారపుపేట కాజ్‌వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ తమ్మిలేరు వరదవిపత్తు నుంచి నగర ప్రజలకు విముక్తి కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే శనివారపుపేట కాజ్‌వే పైన బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నామని అన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ ఏ.భానుప్రతాప్, ఎంఈ కొండల్‌రావు, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

వరి పంటలో చీడపీడల నివారణపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 20: వరి పంటలో వచ్చే వివిధ రకాల చీడపీడల నివారణపై శిక్షణా కార్యక్రమం వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ శిక్షణలో ఏలూరు డివిజన్‌లోని నాలుగు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణను ఉద్దేశించి స్టాటిస్టికల్ ఆఫీసర్ శివాజీ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అధ్యక్షత వహించారు. వరి పంటలో వచ్చు చీడపీడల యాజమాన్యంపై శాస్త్రవేత్త ఫణికుమార్, రమణ, సూచనలు అందజేశారు.

వరద బాధితులకు పాస్టర్ల సాయం

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 20: వరద బాధితులను ఆదుకోవడానికి ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ తరఫున సహాయ సహకారాలు అందిస్తున్నామని బిషప్ జాన్‌ఎస్‌డీ రాజు అన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోమటిలంక గ్రామంలో రూ.2,60,000విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ యోహాన్, పీవీ.రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది పరేడ్



జీలుగుమిల్లి, సెప్టెం బరు 20 : జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ ఆదేశాల మేరకు ప్రతీ శుక్రవారం పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహిస్తున్నట్లు జీలుగు మిల్లి సీఐ బి.వెంకటేశ్వ రావు తెలిపారు. ఈ క్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల వద్ద కొద్దిసేపు పోలీస్ సిబ్బందితో కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. జీలుగుమిల్లి, టి.నరసాపురం, బుట్టాయగూడెం ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

అన్నక్యాంటీన్ ఏర్పాటుపై హర్షం

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 20: ఐదు రూపాయలకే పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్‌ను పట్టణంలో ఏర్పాటు చేయడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ మాట్లాడుతూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కేవలం పదిహేను రూపాయలతో పేదవాడి రోజు గడిచి పోతుందన్నారు.

సామూహికంగా ఎలుకలు నిర్మూలించాలి

నిడమర్రు సెప్టెంబరు 20 : ప్రతి రైతు బ్రోమోడయోలిన్ మాత్రలతో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని నిడమర్రు మండల వ్యవసా య శాఖాధికారిణి ఎస్. గీతా దేవి పిలుపునిచ్చారు. శుక్ర వారం ఛానమిల్లి, బావాయిపాలెం, ఎనికేపల్లి, సిద్ధాపురం, క్రొవ్విడి, అడవి కొలను గ్రామాలలో సామూహిక ఎలుకల నిర్మూలన నిర్వహించారు.



అధిష్ఠానం పిలుపు మేరకు శుక్రవారం అధికారులు, నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, పెన్షన్ల పెంపు, పథకాల పునరుద్ధరణ, ప్రధాన హామీల అమలుపై వివరించారు.



వలసపల్లి, కలిదిండి, వదాలిలో కరపత్రాల పంపిణీ

ఇది మంచి ప్రభుత్వం

100 రోజుల్లో కూటమి విజయాలపై కరపత్రాల పంపిణీ

ప్రజలకు వివరించిన అధికారులు, నాయకులు

ముసునూరు: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం జరుగుతుందని సర్పంచ్ చలసాని దామోదరరావు, గ్రామ అధ్యక్షుడు మేదర మెట్ల సురేంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వలసపల్లి, బలివే గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో సభలు నిర్వహించి ప్రభుత్వం అమలు చేసిన హామీలను అధికారులు ప్రజలకు వివరించారు. అనంతరం వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపు, ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాల చెల్లింపు, ధాన్యం బకాయిల చెల్లింపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చేసిన కృషి తదితర వాటితో ముద్రించిన కరపత్రాలను అధికారులు, నాయకులు ప్రతి ఇంటికి అందజేశారు. ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో కూటమి నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పలు పథకాల పునరుద్ధరణ, పెన్షన్ల పెంచి ఇంటింటికీ పంపిణీ, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేతపై నాయకులు ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో వదాలిలో ఈ కార్యక్రమం నిర్వహించగా, ముదినేపల్లిలో టీడీపీ, బీజేపీ నాయకులు కోడూరు శేషబాబు, ఈడే సుధాకర్, అడుసుమిల్లి సాయికృష్ణ, సచివాలయ సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేశారు.



కలిదిండి: కలిదిండిలో శుక్రవారం టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈ వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయకులు బోయిన గోవింద్, నున్న సుబ్రహ్మణ్యం, భత్రాజు ఏసుబాబు, యలవర్తి వెంకటేశ్వరరావు, చేబోయిన రాంబాబు, జాన్ రాజ్, ఎం.బాబురావు, కె.మాత్రాజు పాల్గొన్నారు.

నూజివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే సీఎం చంద్రబాబు ప్రధాన హామీలు నెరవేర్చారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పెన్షను బకాయిలతో కలిపి ఇవ్వటం గొప్ప విషయం అన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజలు ఆస్తులకు రక్షణ కల్పించారన్నారు. విజయవాడ వరదలు బీభత్సంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో సీఎం రాత్రీపగలు శ్రమించి ప్రజలను కాపాడటం ఆయన పరిపాలనా దక్షతకు నిదర్శనం అన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి విషయంలో జగన్ చేసిన తప్పిదం వల్ల కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని, దీనికి మూల్యం తప్పదన్నారు.



ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు విరాళాలు అందజేస్తున్న దాతలు

సీఎం సహాయనిధికి విరాళాలు భేష్

కైకలూరు, సెప్టెంబరు 20: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి దాతలు విరాళాలు అందజేయడం అభినందనీయమని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యుడు ఇందుకూరి సత్యనారాయణరాజు, ఆక్వారైతుల సంఘ నాయకుడు యలకటూరి రవీంద్రబాబు ఒక్కొక్కరు రూ.50 వేలును ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు అందజేశారు. కైకలూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు ఆధ్వర్యంలో రూ.1.35 లక్షలు సర్పంచ్‌లు ఎమ్మెల్యేకు అందజేశారు. అలాగే కైకలూరు కార్నర్‌స్టోన్ జూనియర్ కళాశాల విద్యార్థులు రూ.30 వేలను, భుజబలపట్నం గ్రామపెద్దలు రూ.2.31 లక్షల చెక్కును అందజేశారు. మండవల్లి మండలం భైరవపట్నానికి చెందిన చెదలవాడ శివన్నారాయణ రూ.50 వేలు, ఆలపాడు శ్రీకాంత్ ఇంటర్నేషనల్ కంపెనీ అధినేత అల్లూరి చోళ్ళ వర్మ రూ.25 వేలు, ఐశ్వర్య ఇంపెక్స్ అధినేత ఇర్రింకి సత్యకిషోర్ రూ.25 వేలు చెక్కులను అందజేశారు.

భారీ వర్షం



చాట్రాయి, సెప్టెంబరు 20: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సుమారు 45 నిమిషాల పాటు కుండపోత వర్షం పడింది. స్వల్పకాలిక వరి పైరు ప్రస్తుతం పాలకంకి దశలో ఉంది. ఈ వర్షానికి కంకి రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉన్నదని రైతులు అంటున్నారు.

గోతులు పూడ్పించిన ఎస్ఐ



చాట్రాయి, సెప్టెంబరు 20: చాట్రా యి- నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న పెద్ద పెద్ద గోతు లను గురువారం రాత్రి ఎస్సై రామకృష్ణ ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి పూడ్పించారు. అతివేగం అధికలోడు లేకుండా వాహనచోదకులు సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకారుల సంఘం ఏర్పాటుకు వినతి



ముసునూరు, సెప్టెంబరు 20: ముసునూరులో నూతనంగా మత్స్యకారుల సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో జి.రాణికి మత్స్య కారులు, రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ గత 15 ఏళ్ళుగా చేపలు వేటతో మత్స్యకారులు జీవిస్తున్నారన్నారు. గ్రామంలో దేవర చెరువు, నల్లచెరువులు సొసైటీ కింద ఉన్నాయని, ఈ రెండు చెరువులపై ఆధారపడి మత్స్యకారులు ఉన్నారన్నారు. సంఘ సభ్యులను గుర్తిం చి, నూతన మత్స్యకారుల సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. చెం గల వెంకటేశ్వరరావు, రవితేజ, రెడ్డి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిగూడెంలో స్వచ్ఛతా హీ సేవ

ముసునూరు, సెప్టెంబరు 20: స్వచ్ఛ అక్కిరెడ్డిగూడెం పంచాయతీనే లక్ష్యమని సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం పంచాయతీ పరిధిలోని కాలనీల్లో చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా సంపద కేంద్రానికి తరలించారు. మురుగునీటి నిల్వ ప్రదేశాలు, డ్రైనేజీ వద్ద బ్లీచింగ్ చల్లించారు. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ తెలిపారు. సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యదర్శి విద్యాధరరావు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మికి ఉత్తమ పాల ఉత్పత్తిదారు అవార్డు



ముదినేపల్లి, సెప్టెంబరు 20: కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలో ఉత్తమ పాల ఉత్పత్తిదారు అవార్డు ముదినేపల్లి మండలం గురజ మిల్క్ సొసైటీ అధ్యక్షురాలు ఉప్పలపాటి శ్రీలక్ష్మికి దక్కింది. 2023-24లో ఆమె 25,263 లీటర్ల పాలు గురజ మిల్క్ సొసైటీలో పోసి జిల్లా మిల్క్ యూనియన్‌లో ప్రథమ స్థానంలో నిలిచి ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు కింద వెండి గిన్నె, ప్రశంసాపత్రాన్ని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. గతంలో కూడా శ్రీ లక్ష్మి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి అవార్డులు అందుకున్నారు.



మిలాన్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మిలాన్ ఉన్ నబీ ర్యాలీ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 20: నూజివీడు పట్టణంలో ముస్లింల ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీని నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ పండుగనాడు అనుమతులు రాకపోవడంతో శుక్రవారం పాత పేట మసీదు నుంచి ముస్లింలు జెండాలతో ర్యాలీ చేశారు.

పాఠశాల తనిఖీ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 20: నూజివీడు మండలం సిద్ధార్థనగర్ ఎంపీయూపీ పాఠశాలను ఎంఈవో-2 జమలయ్య శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల పురోగతి, మధ్యాహ్న భోజనం తదితరాలను ఆయన పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఎంల సమావేశం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 20: నూజివీడు డీవైఈవో కార్యాలయంలో డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్ని యాజమాన్యాల పరిధిలో ప్రధానోపాధ్యాయులకు సమావేశాన్ని నిర్వహించగా ఏఎంవో రెడ్డి రామారావు సిలబస్ పూర్తి, టీచర్లు, విద్యార్థుల హాజరు, పాఠ్య పుస్తకాల సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. సీఎంవో రామా రావు, డిజిటల్ ఇన్‌ఫ్రా కో-ఆర్డినేటర్ శ్రీహరి, డీవైఈవో సేవ్యా తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్‌కు సానుకూలం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం, సెప్టెంబరు 20: నరసాపురం మచిలీపట్నం మధ్య ఇటీవల బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొత్త రైల్వేలైన్ నిర్మాణంపై రైల్వే చేపట్టిన సర్వే అనుకులంగా ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ చెప్పారు. నరసాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొగల్తూరు- బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం వరకు చేపట్టే కొత్త రైల్వేలైన్‌కు అయ్యే ఖర్చు, భూ సేకరణ, ప్రయాణికుల రద్దీ, ఇతర రూట్లలోని మార్గాలతో అనుసంధానం తదితర అంశాలపై రైల్వే ప్రాథమిక సర్వే చేసిందన్నారు. మరో 15 రోజుల్లో ఈ నివేదిక ఢిల్లీలోని రైల్వే బోర్డుకు వెళ్లతుందన్నారు.తరువాత ఈ ప్రాజెక్టుకు క్లియరెన్స్ వస్తుందని మంత్రి చెప్పారు.

నరసాపురం నుంచి వారాణసీ

రాష్ట్ర విభజన తరువాత ఏపీ నుంచి వారాణసీ వెళ్లేందుకు ప్రత్యేక రైలు లేదు, ప్రస్తుతం విశాఖ నుంచి ఒక రైలు నడుస్తున్నా అది విజయనగరం జిల్లా వాసులకే తప్ప మిగిలిన జిల్లా వాసులకు పెద్దగా ఉపయోగం ఉండటం లేదు. దీన్ని పరిగణలోకి తీసుకుని నరసాపురం నుంచి నడపాలని రైల్వే మంత్రిని కోరినట్లు శ్రీనివాసవర్మ చెప్పారు. లేదా నరసాపురం నుంచి మరో రైలును నడిపితే ఉభయగోదావరి జిల్లా వాసులతో పాటు కృష్ణా, గుంటూరు ఇతర జిల్లావాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటితో పాటు నరసాపురం నుంచి పగటిపూట వందేభారత్ నడపాలని కోరామన్నారు. ఇది కాకుండా చెన్నై విజయవాడల మధ్య నడుస్తున్న వందేభారత్ నరసాపురం లేదా భీమవరం వరకు పొడిగించాలని విన్నవించామన్నారు. మరో మూడు నెలల్లో వీటిపై క్లారిటీ వస్తుందని మంత్రి చెప్పారు. ఇవికాకుండా నరసాపురం నుంచి ప్రతి ఆదివారం హైద్రాబాద్‌కు నడుస్తున్న స్పెషల్, వీక్లి బెంగుళూరు స్పెషల్‌ను కూడా రెగ్యూలర్ చేయాలని మంత్రిని కోరామన్నారు. కోటిపల్లి రైల్వేలైన్ పనులు గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. వాటాగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తంలో ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఇప్పటి వరకు రైల్వే ఈ ప్రాజెక్టుకు రూ 1200 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కోనసీమ జిల్లాలో భూసేకరణ పెండింగ్ పడింద న్నారు. దిగమర్రు నుంచి పామర్రు వరకు చేపట్టే 165 జాతీయ రహదారి పనుల్ని వేగవంతం చేస్తామన్నారు. భీమవరం, ఉండి రహదారిలో పెండింగ్ పడిన వంతెన పనుల్ని వచ్చే నెలలో మొదలు పెడతామని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే నాయకర్, ఆర్డీవో అంబరీస్, శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, పీవీఆర్‌లు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు కృషి : ఐజీ అశోక్‌కుమార్



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో గంజాయి నియం త్రణపై ప్రత్యేక దృష్టి సారించామని ఏలూరు రేంజి ఐజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లి గూడెం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం పరిశీలించారు. ఏలూరు రేంజ్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పోలీస్‌స్టేషన్ భవణాల ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. జిల్లాకు సైబర్ క్రైం స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. సోషల్ మీడియా మోసాల బాధి తులకు అండగా ఉండేందుకు, బాధితులకు అవగాహన కల్పించేందుకు స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్పీ నయీం అస్మి, డీఎస్పీ మూర్తి, సీఐలు రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సింహాద్రిపురం-నూజివీడు ప్రధాన రహదారి మధ్యలో పడిన గొయ్యి

అధికారులూ.. గోతిని పూడ్పించండి

ముసునూరు, సెప్టెంబరు 20: ముసునూరు-నూజివీడు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మధ్యలో సింహాద్రిపురం వద్ద ప్రమాదకర గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో వరదనీటి ఉధృతికి ఈ రహదారి కింద నీరు పోయేందుకు వేసిన సిమెంట్ తూరలు ధ్వంసమై రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడింది. రాత్రి సమయంలో దగ్గరకు వచ్చే వరకు గొయ్యి కనిపించక పోవడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల పలువురు వాహనదారులు అదుపుతప్పి ప్రమాదానికి గురై గాయాలపా లయ్యారు. పొట్లూరి మహేంద్రవర్మ అనే రైతు ప్రమాదాలను గుర్తించి ముళ్ళకంప, ఎత్తుగా పచ్చటి చెట్టు కొమ్మలను హెచ్చరికగా ఈ గొయ్యిలో పాతారు. ఈ గొయ్యి ఏర్పడి సుమారు 15 రోజులు కావస్తున్నా అధికారులు పట్టించుకోలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదకర గొయ్యిని పూడ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతు న్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

కలిదిండి, సెప్టెంబరు 20 : భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పోలిబోయిన నాగ పెద్దింట్లమ్మ (40)ను భర్త మారయ్య మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లోంచి వెళ్లి పోయింది. ఆచూకీ లభ్యం కాక పోవటంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

నూజివీడు ట్రిపుల్ ఐటీని పరిశీలించిన అధికారుల బృందం

నూజివీడు/నూజివీడు టౌన్, సెప్టెంబరు 20 : నూజివీడు ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్న కారణంగా రెండు నెలలుగా వారు అనారోగ్యం బారిన పడడం, విద్యార్థుల ఫిర్యాదుపై జిల్లా అధికారులు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకస్మిక తనిఖీలు చేసి ఆహారం నాణ్యత లేదని నిర్ధారించి, నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఉన్నతాధికారుల కమిటీ బృందం శుక్రవారం ట్రిపుల్ ఐటీని సందర్శించింది. కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలసి భాస్కర్ ఒకటో నంబరు మెస్‌ను అక్కడ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెస్‌లో భోజన పదార్థాల తయారీ విధానం పారిశుధ్య నిర్వహణ, ఆహార తయారీకి వినియోగించే సరుకుల నాణ్యతను పరిశీలించారు.

అధికారులతో సమీక్ష

అనంతరం సమావేశపు హాలులో శుక్రవారం ట్రిపుల్ ఐటీ అధికారులు, కలెక్టర్‌తో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. 'ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. పూర్తిస్థాయి ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మెస్ కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త టెండర్లు పిలవాలి. ఇందుకు కమిటీని నియమించి ప్రభుత్వ నిబంధనలు అమలు చేసేవారికే మెస్ కాంట్రాక్ట్ అప్పగించాలి. ఆహార నాణ్యతను, పారిశుధ్యాన్ని పర్యవేక్షించటానికి కమిటీలు ఏర్పాటు చేయాలి. కమిటీలో పౌష్టికాహార నిపుణులు, ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థుల ప్రతినిధులు సభ్యులుగా ఉండాలి. కమిటీ ప్రతి వారం సమీక్షించి ఆహార తయారీ, సరుకుల నాణ్యతను యాప్‌లో నమోదు చేయాలి. నాణ్యతలో లోపాలుంటే వెంటనే కాలేజీ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకురావాలి. ప్రాంగణంలో సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉండాలి'అని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 4 ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కళాశాల విద్యాశాఖ కమిషనర్, ఉన్నత విద్యాశాఖ మండలి ఛైర్మన్, సంబంధిత జిల్లా కలెక్టర్‌తో కమిటీని నియమించిందన్నారు. నాణ్యమైన భోజనం, మెరుగైన సౌకర్యాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొంది స్తామన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి ఛైర్మెన్ రామ్మోనరావు, ఆర్డీవో భవానిశంకరి, వైస్ ఛాన్సలర్ ఎం.విజయ్‌కుమార్, రిజిస్ట్రార్, ఇన్‌చార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బండి ప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మెస్‌లో భోజనంపై విద్యార్థులను ఆరా తీస్తున్న కమిషనర్



ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కలిదిండి/కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 20 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శుక్రవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సత్కరించారు. కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణలో ఎంఈవో నరేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు సింగరాజు పద్మలత, పనస ఉమాలక్ష్మి, గడ్డె విమల, చిలకల్లు బోసుబాబు, తిరుమలశెట్టి జయరాజు, ఎండి సనాఉల్లా, పుప్పాల శివనాగమణి, బడిపాటి ప్రసన్న లక్ష్మి, మత్తి శ్రీను, రేమాల అరుణ్ కుమారిలను సన్మానించి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. టీచర్స్ యూనియన్ సంఘాల నాయకులు వారిని అభినందించారు. శుక్రవారం స్వచ్ఛతా హిసేవా కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మొక్కలను నాటారు. రేంజర్ రామలింగాచారి, డీఆర్వో జయప్రకాష్, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండవల్లి మండలం లోకుమూడిలో ఏలూరు రోడ్డులో శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనలో కామినేని పాల్గొని భక్తులకు వడ్డన చేశారు.



పనులను పరిశీలిస్తున్న బలే ఏసురాజు తదితరులు

కోలుకుంటున్న కొల్లేరు లంక గ్రామాలు

కైకలూరు, సెప్టెంబరు 20 : కొల్లేరు వరద ఉధృతి క్రమేపీ తగ్గుతోంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో గత 12 రోజులుగా ముంపు బారిన పడిన గ్రామాలు తేరుకుంటున్నాయి. రహదారులు ముంపు నుంచి కొంత బయటపడడంతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కైకలూరు మండలంలో కొల్లేటికోట పెద్దింటి అమ్మవారు ఆలయానికి వెళ్లే రహదారిపై కొద్దిమేర నీరు ప్రవహిస్తోంది. రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు రహదారిపై నీరు రాకుండా ఎక్స్‌కవేటర్లతో అడ్డుకట్టలు వేయించారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారి కోతకు గురైన ప్రదేశాల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడతామన్నారు.

కుళ్లిన కోడిగుడ్లపై ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, సెప్టెంబరు 20 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించే కోడిగుడ్లు నాణ్యత, సరఫరా విధానాలపై ఆరా తీసేందుకు ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. "మధ్యాహ్న భోజనంలో కుళ్లిన గుడ్లు" శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా ఇంటెలిజెన్స్ అధికారులు ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని స్థానిక ఇంటెలిజెన్స్ విభాగం సిబ్బందికి ఆదేశాలు జారీ చేయగా, ఆ విభాగం హెడ్ కానిస్టేబుల్ శ్రీరామ్ విచారణ జరిపి కుళ్లిన గుడ్లు చేవూరుపాలెంలో గుర్తించిన విషయం నిజమేనని జిల్లా అధికారులకు తెలిపారు. ఇదిలా ఉండగా, డీఈవో అబ్రహం ఆదేశాల మేరకు ముదినేపల్లి ఎంఈవో-1 సేవ్యా నాయక్ మండల విద్యాశాఖ సిబ్బందితో చేవూరుపాలెం పాఠశాలలో విచారణ జరిపించారు. సీఆర్పీ విజయదుర్గ, కార్యాలయ ఉద్యోగి ఫణి ఆ పాఠశాలలో కుళ్లిన కోడిగుడ్లు విషయమై హెచ్ఎం అరుణ కుమారిని అడిగి తెలుసుకున్నారు. గుడ్లు కుళ్లినవి సరఫరా అయినట్లు రుజువయింది. వెంటనే కాంట్రాక్టరుతో మాట్లాడి కొత్తగుడ్లను ఇచ్చే ఏర్పాట్లు చేశారు. దీనిపై ఎంఈవోకు సీఆర్పీలు నివేదిక పంపారు.

పోషకాహారంతోనే రక్తహీనతకు చెక్



కైకలూరు, సెప్టెంబరు 20: పోషకాహారంతోనే కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. లావణ్య అన్నారు. శుక్రవారం కైకలూరు బైపాస్ రోడ్డులోని మాతా స్కూల్లో కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కిశోర బాలికల్లో ఎక్కువమందికి రక్తహీనత ఉంటుందని అందువల్ల ప్రతి రోజూ వారు పోషకాహారంతో కూడిన భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు మధుర, సైదాని, జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో పోషకాహారం ప్రాధాన్యతను గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రిదేవి కోరారు. మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చాట్రాయి వెలుగు కార్యాలయంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. పోషకాహార ప్రదర్శన నిర్వహించి గర్భిణులు, బాలింతలు, బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, పెరళ్ళలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఏపీఎం శేఖర్, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడా పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన బాలుర క్రీడా పోటీలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 20: నూజివీడు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. నూజివీడు ఎస్సార్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను డీవైఈవో సేవ్యా ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ తదితర విభాగాల్లో అండర్-14, అండర్-17 క్రీడాకారుల ఎంపిక జరిగింది. వ్యాయామ ఉపాధ్యా యులు రవీంద్ర, నాగరాజు, సుకుమార్, నాగేశ్వరరావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు త్రివిధ విద్యార్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 20: జిల్లా స్థాయి క్రీడలకు త్రివిధ పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. అండర్-17 కబడ్డీలో తేజ, హేమచంద్, చెస్‌లో వెంకట్రామ సాయి, జూనియర్ చెస్‌లో వంశీ, అమిత్, వాలీవాల్ అండర్-17లో వంశీ, యోగాలో రాజా, ఖోఖోలో ఎన్.ప్రవీణ్, ఖోఖో జూనియర్స్‌లో నవతేజ్, షటిల్ అండర్-17లో వై.దుర్గా ప్రసాద్, నాగకౌశిక్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన త్రివిధ విద్యార్థులు